





అయోధ్య అక్షింతలతో వైభవంగా శోభాయాత్ర


అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలతో శోభాయాత్రలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: అయోధ్య నుంచి అక్షింతలతో మండల కేంద్రం దేవరాపల్లిలో ఆదివారం వైభవంగా శోభాయాత్రను నిర్వహించారు. మహిళల కోలాటం మధ్య ఈ యాత్ర సాగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎంను శ్రీరామ భక్తులు, ప్రజాప్రతినిధులు, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతులు మీదుగా ఈ అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలకు అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అక్షింతలతో కూడిన కలశాన్ని తలపై పెట్టుకుని ప్రధాన రహదారి మీదుగా శోభా యాత్ర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, కె.వి.రమణ, భీమవరపు కోటేశ్వరరావు, కొరుపోలు శ్రీను, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రముక్ స్వామినాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, పోతల శంకరరావు, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, చింతల సత్య వెంకటరమణ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీలు మొల్లి కృష్ణమూర్తి, పోతల వెంకటరావు తదితర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయి ఇంటర్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ పోటీల్లో మండలంలోని తామరంలో అవంతి కళాశాల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బ్యాడ్మింటన్ పోటీల్లో చుక్కల ప్రసాద్, రాహుల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఏవో డానియల్‌రాజ్, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

సీఎం జగన్ పాలనలో ప్రజలకు మరింత మంచి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆకాంక్ష


న్యూ ఇయర్ కేకును విద్యార్థినులకు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ పాలనలో మరింత మంచి జరుగుతుందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో ఆదివారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ ఇయర్ కేకును కట్ చేసి విద్యార్థినులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. మాడుగుల నియోజకవర్గం ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం వసతిగృహాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభా గం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్ వేచలపు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖండివరంలో అతిసార

చీడికాడ: మండలంలోని ఖండివరంలో అతిసార విజృంభిస్తోంది. రోజుకు ఒకరిద్దరు చొప్పున మాడుగుల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఇ.ఈశ్వరమ్మ, వై.గంగునాయుడు, శీరంరెడ్డి శ్రీరామమూర్తి, ఎం.దేముడమ్మ, ఎస్.సన్యాసమ్మ, పి.కన్నమ్ము చికిత్స నిమిత్తం చేరారు. మరోవైపు గ్రామానికి చెందిన నేమాల సత్తిబాబు(60)వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే మాడుగుల సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లకుండా మాడుగులలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో గ్రామానికి తీసుకొచ్చిన తర్వాత మృతి చెందినట్లు అతని కుమారుడు కన్నంనాయుడు వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న చీడికాడ వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సేవలందిస్తున్నా అతిసారం అదుపులోకి రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కశింకోట: కశింకోట వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్టు అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు రోడ్డులో నడిచి వెళుతున్న అనకాపల్లిలోని కోట్ని వీధికి చెందిన బత్తుల సత్యనారాయణ(73)ను శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.





























గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

మాడుగుల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండల కమిటీలను ప్రకటించింది. నియోజకవర్గంలో మాడుగుల మండలాధ్యక్షుడిగా తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఉపాధ్యక్షులుగా సయ్యపురెడ్డి నారాయణరావు, పెంటకోట అప్పారావు, చీడికాడ మండలాధ్యక్షుడిగా గొల్లవిల్లి రాజబాబు, ఉపాధ్యక్షులుగా చుక్కా అప్పలనాయుడు, చలుగు అప్పలనాయుడు, దేవరాపల్లి మండలాధ్యక్షుడిగా బూరె బాబూరావు, ఉపాధ్యక్షులుగా దొగ్గ అప్పలనాయుడు, గూడెపు రాము, కె.కోటపాడు మండలాధ్యక్షుడిగా రెడ్డి జగన్‌మోహన్, ఉపాధ్యక్షులుగా చీపురపల్లి, అచ్చిబాబు, బండారు రామస్వామి పాత్రుడులను నియమించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

మాకవరపాలెం: ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక ఆంధ్ర బాపిస్టు చర్చిలో సర్పంచ్ అల్లంపల్లి శిరీష వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు.

చదవటం ఇష్టంగా మలుచుకోవాలి

నర్సీపట్నం: విద్యార్థులు చదవటం ఇష్టంగా మలుచుకోవాలని శాఖా గ్రంథాలయ అధికారి పి.దమయంతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవటం మాకిష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలతో కథల పుస్తకాలను చదివించి నీతిని విద్యార్థులకు వివరించారు. తరుచూ గ్రంథాలయానికి వచ్చి చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. లైబ్రేరికి రావటం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీచర్ ఆర్.ఫాతిమా పాల్గొన్నారు.



విద్యార్థులతో చదివిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

వైద్యశాలలు - ప్రజల పాలిట దేవాలయాలు (నర్సీపట్నం డాక్టర్స్ డైరీ)

మెడికల్ హబ్‌గా నర్సీపట్నం



నిర్మాణంలో మెడికల్ కళాశాల



అధునాతన వైద్య సేవలందిస్తున్న ఏరియా ఆస్పత్రి ఇదే..

నర్సీపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో నర్సీపట్నం మెడికల్ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. గతంలో ఏ ఆపద వచ్చినా విశాఖ వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యం కల్పించారు. అందులో భాగంగానే నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం, భీమబోయిన పాలెం వద్ద రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మితమవుతోంది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడంతో గ్రామీణులకు ఇక్కడ కార్పొరేట్ వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. ఈ పథకం జాబితాలోకి ప్రస్తుతం 3,257 వ్యాధులను చేర్చారు. వీటి చికిత్సకు అధునాతన స్కానింగ్ సెంటర్లు, ఎమర్జెన్సీ యూనిట్లు ఏర్పడ్డాయి. ప్రతి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందుతున్నాయి.

అందుబాటులో కార్పొరేట్ వైద్య సేవలు

పెదబొడ్డేపల్లి అక్షయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, పాలీట్రామా వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ మల్లికార్జున్‌రావు తెలిపారు. శ్రీ హర్ష ఎమర్జెన్సీ కేర్ యూనిట్ ద్వారా గుండె, లివర్, ఊపిరితిత్తులు, లివర్‌కు సంబంధించి వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ హర్ష తెలిపారు. ఐదు రోడ్ల జంక్షన్‌లోని శ్రీలలిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో స్టెమ్సెల్స్ థెరపీ, పీఆర్‌పీ, కీహోల్ సర్జరీ, ఐఎంఐఎల్ నెయిలింగ్ సేవలతో పాటు చర్మవ్యాధులకు అధునాతన టెక్నాలజీతో వైద్యులు సూర్యనారాయణ, శ్రీదేవి, శృతి, తదితరులతో వైద్య సేవలు అందిస్తున్నామని ఆర్థోపెడిక్ వైద్యుడు హనుతేజ తెలిపారు. లైఫ్‌లైన్ హాస్పిటల్‌లో ప్రతి బుధవారం బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. శ్రీనివాస క్లినిక్ ద్వారా పేదలకు ఉచిత సేవలు, తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ రాయపురెడ్డి శ్రీనివాస్ తెలిపారు. వి.వి.ఎస్.నర్సింగ్ హోమ్ ఎముకలు, డెంటల్ సేవలు అందిస్తున్నామని వైద్యులు రాజు, అలేఖ్య దివ్య తెలిపారు. పాయకరావుపేట హైమ నేత్రాలయం డాక్టర్ ప్రసాద్ కంటి సంబంధించిన అన్ని సర్జరీలు ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్నారు. జనని తల్లీ పిల్ల ఆస్పత్రిలో తల్లీబిడ్డలకు సురక్షతమైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యులు శ్రీకాంత్, వందన తెలిపారు. అభినవ్ నర్సింగ్ హోమ్‌లో ప్రసూతి సేవలు అందిస్తున్నామని మత్తు వైద్యనిపుణులు డాక్టర్ మల్లికార్జున్‌రావు, స్త్రీ వైద్య నిపుణులు పద్మిని తెలిపారు, అమ్మ హాస్పిటల్‌లో ఎండోస్కొపి, కొలనోస్కోపీ సేవలు అందిస్తున్నామని జనరల్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ రాజు తెలిపారు. రాజు దంత వైద్య శాఖ ద్వారా అధునాతన సేవలు అందిస్తున్నామని డాక్టర్ రాజు తెలిపారు. మాకవరపాలెం మార్కండేయ ఆయుర్వేద వైద్యాలయం ద్వారా ఆయుర్వేద సేవలు అందిస్తున్నామని డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు.



కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పూల బొకేలు


కేకుల కోసం బేకరీ వద్ద రద్దీ

- అర్ధరాత్రి నుంచే సంబరాలు
- ఆనంద డోలికల్లో యువత



వెల్‌కమ్ 2024 కేక్

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/కె.కోటపాడు/మాడుగుల రూరల్: గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ప్రజలందరూ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలను, దేవాలయాలను ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులు గ్రీటింగ్స్, సెల్‌ఫోన్ల ఎస్ఎంఎస్‌లతో స్నేహితులకు, బంధువులకు, పెద్దలు, ఉద్యోగులు పూల బొకేలు, పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. సోమవారం నూతన సంవత్సరం కావడంతో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు మేల్కొని ఎంతో ఉత్సాహంతో వేడుకలు నిర్వహించారు. చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. దీంతో వండ్ల దుకాణాలు, స్వీట్ స్టాళ్లు, బేకరీలు, పూల దుకాణాలు, గ్రీటింగ్ షాపులు, ఆఫర్లతో బిర్యానీ దుకాణాలు, రెస్టారెంట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో మహిళలు ఇంటి వాకిళ్లలో వీధిరోడ్లపైన అందమైన రంగవల్లులు వేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి మద్యం సేవించి రోడ్లపై బైక్‌లపై తిరగకుండా, గుంపులుగా ఉండకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.


కె.జె.పురంలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం


బుచ్చెయ్యపేటలో విద్యుత్ కాంతులతో ముస్తాబైన చర్చి

యువత 'నూతన' నుత్తేజం....

ఆశల పల్లకిలో కొత్త సంవత్సరానికి యువత స్వాగతం పలికింది. 2023 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2024కు స్వాగతం చెబుతూ ఆనంద డోలికల్లో మునిగి తేలింది. రాత్రి కేక్‌లు కట్ చేసి, బాణ సంచాలు కాల్చి సంబరాలు జరుపుకుంది.

గంజాయి కేసులో మరొకరికి రిమాండ్

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించి భద్రపరిచిన గంజాయి చోరీకి పాల్పడిన కేసులో మరో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈస్ట్ గంగవరానికి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావును 9వ నిందితుడిగా ఈ కేసులో యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాసరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.ఈ మేరకు నిందితుడ్ని యలమంచిలి రూరల్ పోలీసులు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదే కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి విశాఖ సెంట్రల్ ప్రిజన్‌కు రిమాండుకు, ఇద్దరు మైనర్లను జువెనైల్‌హోంకు ఇప్పటికే తరలించారు. యలమంచిలి పట్టణానికి చెందిన మరో నిందితుడు కార్తీక్ పరారీలో ఉన్నాడు.అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.









ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు


జె.డి.పేటలో అయోధ్య రామ అక్షింతలు ఊరేగిస్తున్న భక్తులు

కె.కోటపాడు: అయోధ్య రామ మందిర అక్షింతలను హిందూ ధర్మ ప్రచారకర్తలు ప్రతీ ఇంటికి చేర్చడం ఆనంద దాయకమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక శివాలయం నుంచి అక్షింతల బిందెలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ప్రతీ గ్రామంలో ప్రతి ఇంటికి అక్షింతలను చేరవేసే కార్యక్రమంలో ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. హిందూ ధర్మ ప్రచారకర్త బంకుపల్లి సత్యనారాయణ, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామశాస్త్రి, బండారు రమణమూర్తి, డెక్క వెంకునాయుడు, లాలం శ్రీనివాసరావు, పూడి నారాయణమూర్తి, సూరిశెట్టి నారాయణ, సూరిశెట్టి దాసు, పూడి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

జె.డి.పేటలో..

మాడుగుల రూరల్: అయోధ్యలో రాముని అక్షింతలు ఊరేగింపు కార్యక్రమం జె.డి.పేటలో ఆదివారం నిర్వహించారు. అక్షింతలను సోమవారం నుంచి గ్రామంలో ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, భజన బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అక్షింతలను స్థానిక రామాలయంలో ఉంచారు.


కె.కోటపాడులో అక్షింతల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న అనురాధ, జగన్‌మోహన్



వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండల కమిటీలను ప్రకటించింది. నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఏకా సత్య శివ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పల్లెల వీర బాబు, కె.వెంకటరమణ, నర్సీపట్నం మండల అధ్యక్షుడిగా సుర్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పైల పైడియ్యనాయుడు, లగుడు రామచంద్రరావు, మాకవర పాలెం మండల అధ్యక్షుడిగా రుత్తల శ్రీనువాసు, ఉపాధ్యక్షులుగా బండారు సత్య నారాయణ, బంగారు అప్పలనాయుడు, గొలుగొండ మండల అధ్యక్షుడిగా లెక్కల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పత్తి రమణ, గజ్జెలపు అర్జున్‌రావు, నాతవరం మండల అధ్యక్షుడిగా లగుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సిద్దాబత్తుల రమణ, ఇటంశెట్టి గోవిందరావులను నియమించారు.

చోడవరం: వైఎస్సార్ సీపీ మండల స్థాయి నూతన కమిటీలను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఇప్పటికే పార్టీ అధ్యక్షులను ప్రకటించిన పార్టీ కేంద్ర కార్యాలయం తాజాగా పూర్తిస్థాయి మండల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో చోడవరం మండల అధ్యక్షుడిగా దొడ్డి వెంకట్రావు, ఉపాధ్యక్షులుగా చవితిన బాబూరావు, చిటిబోలు జగన్నాథరావు నియమితులయ్యారు. బుచ్చెయ్యపేట మండల అధ్యక్షుడిగా జోగా కొండబాబు, ఉపాధ్యక్షులుగా గొంప అప్పారావు, బోయిన నారాయణమూర్తి, రావికమతం మండల అధ్యక్షుడిగా ముక్కా మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యక్షులుగా శీలం శంకరరావు, రాజాన రామునాయుడు, రోలుగుంట మండల అధ్యక్షుడిగా గొర్లె వెంకటరమణ (బుజ్జి), ఉపాధ్యక్షులుగా దోసపత్ని రాజు, ఉలబాల రాము నియమితులయ్యారు.



మోదకొండమ్మకు వెండిపంచపాత్ర బహూకరణ


వెండి పంచపాత్ర ఉద్ధరిణి మోదకొండమ్మ ఆలయంలో కమిటీ ఛైర్మన్‌కు అందజేస్తున్న కుప్పిలి కుటుంబ సభ్యులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో స్థానిక భక్తులు కుప్పిలి కుటుంబ సభ్యులు భవానీ శంకర్, లక్ష్మి ప్రసన్న దంపతులు ఆదివారం పదిన్నర తులాల, వెండి పంచపాత్ర, ఉద్ధరిణి, అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్, పుప్పాల అప్పలరాజు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



రేపటి నుంచి వడ్డాది డైవర్షన్ రోడ్డుపై రాకపోకలు


ఇటీవల మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు


డైవర్షన్ రోడ్డు వద్ద జరుగుతున్న పనులు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్ భారీ వర్షానికి డైవర్షన్ రోడ్డుపై నుంచి పెద్దేరు నీరు ప్రవహించింది. నీటి ఉధృతికి ఈ రోడ్డు కోతకు గురైంది. దీంతో నర్సీపట్నం, చోడవరం, విశాఖ, పాడేరు, కాకినాడ తదితర మార్గాల్లో ఆర్టీసీ బస్సులతోపాటు భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వడ్డాది డైవర్షన్ రోడ్డు పనులు చేస్తుండగానే విజయరామరాజుపేట వద్ద వందేళ్ల క్రితం నిర్మించిన తాచేరు వంతెన కూలిపోయింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ముందుగా విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సాగేలా చేశారు. ప్రస్తుతం వడ్డాదిలో కోతకు గురైన డైవర్షన్ రోడ్డు వద్ద రాయి, ఇసుక, గ్రావెల్ వేసి లెవెలింగ్ పనులు చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నానికి ఈ పనులు పూర్తి చేసి సాయంత్రం నుంచి వాహనాల రాకపోకలకు అనుమతించడానికి చర్యలు చేపట్టారు. ముందుగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు రాకపోకలకు అనుమతిస్తారు. సంక్రాంతి పండగ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపు నేపథ్యంలో వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందని డైవర్షన్ రోడ్డు, వంతెన పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.



దంపతులపై దాడి


దాడిలో గాయపడిన దంపతులు

యలమంచిలి రూరల్: వ్యక్తిగత దూషణలతో క్షణికావేశానికి గురైన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు పొరుగున్న దంపతులపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని పులపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు,వైద్య సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం పులపర్తి బీసీ కాలనీ రైస్ మిల్లు పక్కన నివాసముంటున్న దంపతులు పెద్దాడ బేబీ,భర్త కల్యాణ్,సమీపంలో నివాసముంటున్న మరో కుటుంబానికి ఆదివారం ఉదయం స్వల్ప వివాదం ఏర్పడింది. తన ద్విచక్రవాహనం తాళాన్ని ఎవరో విరగ్గొట్టారంటూ బేబీ తిట్టుకుంటుండగా తమనే దూషిస్తున్నారనుకుని ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు కర్రలతో తమపై దాడి చేశారని బేబీ ఆరోపిస్తోంది. తన భర్తను కూడా ముగ్గురూ ఇష్టానుసారంగా కొట్టారని తెలిపింది. ఈ దాడిలో బేబీ కుడి చేయిపై తీవ్ర గాయమైంది. 15 కుట్లు వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె భర్త కల్యాణ్‌కు కూడా ప్రథమ చికిత్స అందజేశారు. అయితే ఆరోపణలెదుర్కొంటున్న కుటుంబం కూడా బేబీ, ఆమె భర్త తమపై దాడి చేశారని ఆరోపిస్తూ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. ఇరు కుటుంబాల వారు యలమంచిలి రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

బాల వినాయకునికి వెండి ఆభరణాల బహూకరణ


వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని ఐదు రోడ్ల జంక్షన్‌లో బాలవినాయక స్వామి ఆలయానికి దాతలు గంగాధర కామేశ్వరరావు, రజిని దంపతులు రూ.50 వేల విలువైన వెండి ఆభరణాలను బహూకరించారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ దేవత అరుణ సమక్షంలో స్వామివారికి అలంకరించారు.